# 19863 దిగువన ముగిస్తే

# స్వల్ప కాలానికి బలహీనం




**గత వారం:** అంత క్రితం వారం ఊగిసలాటతో సాగిన మార్కెట్ గత వారం మళ్లీ క్షీణ పథాన పయనించి, ఆఖరులో 134 పాయింట్ల నష్టంతో ముగిసింది. జి-20 దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్ల సమావేశం అందించిన సానుకూల ఫలితం ఆసరాగా మార్కెట్‌లతో వారాన్ని ఆరంభించింది. కరెన్సీ ధరలను మార్కెట్ ఆధారితంగా ఖరారు చేసే పద్ధతికి మారే దిశగా సాగాలని, విదేశ వాణిజ్య సంబంధమైన అసమతుల్యతను తగ్గించుకొనేందుకు చొరవలు తీసుకోవాలని జి-20 సమావేశం తీర్మానించింది. కాగా ఫ్యూచర్స్ - ఆప్షన్స్ గడువు ముగింపు నేపథ్యంలో మార్కెట్లు తీవ్ర స్థాయిలో చలించాయి. అంతర్జాతీయ విపణుల్లో బలహీనత, వడ్డీ రేట్లను పెంచే ఆస్కారం ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ సంకేతం అందించడం అమ్మకాలు మరింత పెరగడానికి దారితీసింది. అమెరికా జీడీపీ సమాచారం కోసం మార్కెట్ వర్గాలు వేచి ఉన్నందున మార్కెట్ సెంటిమెంట్ అప్రమత్తం కావడంతో వారాంతపు రోజు ఒక దశలో సెన్సెక్స్ 19769ను తాకినప్పటికీ, సూచీ దిగ్గజ సంస్థలు ఆశించిన దాని కన్నా మెరుగైన ఫలితాలు ప్రకటించడంతో బీఎస్ఈ ప్రామాణిక సూచీ పుంజుకొని 20032 వద్ద స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) నికర కొనుగోలుదారులుగా ఉండి, రూ. 2,756 కోట్ల నిధులను మార్కెట్‌కు తీసుకువచ్చారు. మ్యూచువల్ ఫండ్‌లు రూ. 391 కోట్ల మేర విక్రయాలు జరిపాయి.

**రంగాల వారీగా చూస్తే:** మన్నికైన వినియోగదారు వస్తువుల రంగం, ఐటీ కంపెనీలు గత వారంలో చక్కని ఫలితాలు విడుదల చేయడంతో ఆ రంగానికి చెందిన షేర్లు రాణించాయి. ఇక వాహన రంగ కంపెనీలు నెలవారీ అమ్మకాల గణాంకాలను వెల్లడి చేయవలసి ఉండటంతో ఆ రంగ కంపెనీల షేర్లు పురోగమించాయి. చమురు- గ్యాస్ రంగం షేర్లు కూడా ఆ రంగంలోని ప్రముఖ సంస్థల ఉత్తమ ఫలితాల ఆధారంగా లాభపడ్డాయి. స్థిరాస్తి, విద్యుత్తు రంగాల షేర్లు వరుసగా మూడో వారం కూడా ఒత్తిడికి లోనయ్యాయి. మార్కెట్‌లో వివిధ రంగాలలో విక్రయాలు పెరిగాయని సూచిస్తూ శుక్రవారం మార్కెట్ విస్తృతి అత్యంత ప్రతికూలంగా మారింది. లాభ నష్టాల నిష్పత్తి 2:5గా నమోదు అయింది.

**ఈ వారం:** అయిదు వారాల భారీ జోరు అనంతరం గత నాలుగు వారాలుగా మార్కెట్ ఎగువ స్థాయిల వద్ద స్థిరీకరణకు గురి అవుతోంది. 19863కు దిగువన సెన్సెక్స్ ముగిస్తే మార్కెట్ స్వల్ప కాల దిద్దుబాటు (కరెక్షన్) ధోరణిలోకి ప్రవేశించినట్లు అవుతుంది. అదే జరిగితే, కరెక్షన్ 19445-19000 స్థాయిలలో ఉండవచ్చు. అలా కాక సెన్సెక్స్ 20461కి ఎగువన స్థిరపడితే సెన్సెక్స్ ఊర్ధ్వముఖ పయనాన్ని మళ్లీ మొదలుపెట్టినట్లు భావించవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** రానున్న మంగళవారం ఆర్‌బీఐ తన ద్రవ్య విధాన సమీక్షలో కీలక రేట్లను మార్కెట్ వర్గాలు తలపోస్తున్న దానికన్నా ఎక్కువగా పెంచితే సూచీలు జారుతాయి. మరీముఖ్యంగా వడ్డీ రేట్లతో ముడిపడ్డ రంగాల షేర్లు పతనం కావచ్చు. వాహనాల అమ్మకాలు, సిమెంట్ ఉత్పత్తి తీరు, టెలికం వినియోగదారుల గణాంకాలను మార్కెట్ గమనిస్తుంది. స్వల్ప కాలానికి మధ్య విలువ, చిన్న విలువ షేర్లలో బలహీనత కొనసాగవచ్చు. అయితే ప్రస్తుతం ఆర్థిక ఫలితాల కాలం కావడంతో ఎంపిక చేసిన షేర్లలో కదలికలు ఉంటాయి. నవంబరు 2న జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎలక్షన్స్ పరిణామాలను ప్రపంచ మార్కెట్లు నిశితంగా పరిశీలిస్తాయి. అలాగే అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం తీర్మానం కోసం కూడా మార్కెట్లు కాచుకొని ఉంటాయి.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 20185, 20352, 20578; **తక్షణ మద్దతు స్థాయిలు:** 19769, 19637, 19445.

**సెన్సెక్స్ 19863కు దిగువన ముగిసినట్లయితే, స్వల్ప కాలానికి మార్కెట్ మరింత బలహీనపడే ప్రమాదం ఉంటుంది.**

– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్